క్లుప్తంగా

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ఆ సంఘం సభ్యులు ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు అడ్వకేట్ ఈశ్వర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా రివ్యూ పిటషన్ వేస్తామన్నారు. రాష్ట్రంలో బిల్లు పెట్టకుండా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు మామిడి భూమయ్య, ఉల్లెంగ కిరణ్, నర్సింలు, బంగారు మైశయ్య తదితరులున్నారు.

జంతర్‌మంతర్ వద్ద..



కామారెడ్డి రూరల్ : ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమంలో కామారెడ్డి జిల్లాకు చెందిన మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి హాజరై ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జుపాక సుధీర్, బంగారు సాయిలు, కిష్టయ్య తదితరులున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పచ్చదనం కార్యక్రమం చేపట్టారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎస్ఎఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యల సంతోష్ అన్నారు.ఈ కార్యక్రమంలో జుక్కల్ మండల ఏఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వాగ్రె సతీష్, శ్రీధర్, అంజు తదితరులున్నారు.

గుండం చుట్టూ ప్రహరీ నిర్మించాలి



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న అతి పురాతనమైన గుండం చుట్టూ ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న గుట్టల్లో నేలకు సమాంతరంగా ఈ గుండం ఉండడంతో ప్రమాదం జరగవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ గుండంలో అన్ని కాలాలు నీటితో నిండి ఉంటుందని ఇది చాలా లోతైన గుండం అని గ్రామస్తులు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల విరాళం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో 2005-2006 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు నవీన్ రెడ్డి, విద్యాసాగర్ పాఠశాల గ్రంథాలయంలో పుస్తకాల కోసం రూ. 50 వేల నగదును హెచ్ఎంకు అందజేశారు. తాము గతంలో పడ్డ కష్టాలు నేటి విద్యార్థి తరానికి రాకుండా ఉండేందుకే ఈ సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో గంప జాతర



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం గంప జాతరను ప్రారంభించారు. గంప జాతరను మాజీ ఎంపీపీ రఘు ప్రారంభించారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో గంప జాతరను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సందీప్, నాయకులు శశికాంత్, యామరాములు ఆరీఫ్, మన్నన్ ఉన్నారు.



కామారెడ్డి పట్టణంలో గతేడాది అలుగు పారుతున్న పెద్దచెరువు

నాడు కళకళ.. నేడు వెలవెల

కామారెడ్డి రూరల్ : ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేక కామారెడ్డి మండలంలోని చెరువులు, కుంటలు నిండక వెలవెలబోతున్నాయి. గతేడాది జూలై నెలలోనే కామారెడ్డి పెద్ద చెరువుతోపాటు మండలంలోని లింగాపూర్, చిన్నమల్లారెడ్డి, శాబ్దిపూర్, అడ్లూర్, తిమ్మక్‌పల్లి తదితర గ్రామాల్లోని చెరువులు నిండి పొంగిపొర్లాయి. కానీ ఈ ఏడాది ఇప్పటిదాకా వర్షాలు ఆశించిన స్థాయిలో కురువకపోవడంతో చెరువులు, కుంటలు నిండక వెలవెలబోతున్నాయి. ఆగస్టు మాసంలో సగం పూర్తికావస్తున్న ఎండలు తీవ్రంగా ఉండడంతో ఈ ఏడాది వర్షాలు కురుస్తాయో లేదోనని రైతులు ఆందోళనలో ఉన్నారు.

ఓవైపు మొక్కజొన్న, పత్తి, వరినాట్లు వేస్తున్న రైతులకు నిరాశ తప్పడం లేదు. చెరువు కింద వేసిన పంటలకు నీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ప్రస్తుతమిలా..

ఆశాజనకంగా వానాకాలం పంటలు



మద్నూర్‌లో సాగవుతున్న పత్తి పంట

మద్నూర్(జుక్కల్) : ఈఏడాది వానాకాలంలో వేసిన పంటలు కళకళలాడుతుండడంతో రైతులు దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వానాకాలం ప్రారంభంలో వేసిన పెసర, మినుము, పత్తి, కంది, సోయాబీన్ పంటలు పూతకు వచ్చి ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో అవసరం ఉన్నంత మేర వర్షాలు కురవడంతో పంటలు ఎదుగుతున్నాయని ఇలాగే వాతావరణం అనుకులిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు.



మద్నూర్ శివారులో సోయాబీన్ పంట

ఇంటింటికీ రక్షాబంధన్

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ముంబోజిపేట తండాలో ఇంటింటికీ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ధర్మజాగరణ కార్యక్రమంలో భాగంగా రక్షబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ధర్మజాగరణ సాంస్కృతిక ప్రముఖ్ మోహనాచారి మాట్లాడారు. మన హిందూ సనాతన ధర్మం పండుగ రక్షాబంధన్ యొక్క విశిష్టతను ఇంటింటికి తెలియజేయడానికి రక్షాబంధన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి నరేష్‌నాయక్, వేణుసింగ్, మహేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.



రాఖీ కడుతున్న ధర్మ జాగరణ సభ్యులు

రైతులకు అందుబాటులో యూరియా

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని సింగిల్ విండో సొసైటీ గోదాంలలో రైతులకు అవసరమైన యూరియా నిల్వలు సిద్ధంగా ఉంచినట్లు చైర్మన్ దేవెందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సొసైటీలో 1810 బస్తాలు, భవానిపేట 560, పోతాయిపల్లి 560 చొప్పున గోదాముల్లో యూరియా బస్తాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. యూరియా అవసరం ఉన్న రైతులు సోమవారం నుంచి తీసుకెళ్లాలని కోరారు.



సొసైటీలో నిల్వఉన్న యూరియా

చురుకుగా ఆలయ రోడ్డు పనులు




లింగంపేట: మండల కేంద్రం సమీపంలోని ఆదిపరాశక్తి మత్తడి పోచమ్మ ఆలయం వరకు రోడ్డు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ప్రతిఏటా ఉగాది సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తుండగా రోడ్డు సౌకర్యం లేక భక్తులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రతి ఆది శుక్రవారాల్లో భక్తులు వస్తుంటారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 2 కోట్లు రోడ్డు పనులు మంజూరు చేయించారు. 15రోజులుగా పనులు జోరుగా సాగుతున్నాయి.

కాసుల బాల్‌రాజ్‌కు సన్మానం



బాన్సువాడ : ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ను ఆదివారం అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బాన్సువాడకు చెందిన వ్యక్తికి రాష్ట్రస్థాయి పదవీ రావడం హర్షనీయమని అయ్యప్ప సేవాసమితి సభ్యులు విఠల్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి సభ్యులు సాయిరెడ్డి, శ్రీధర్, రఘువీర్‌రెడ్డి, భాస్కర్, కొట్టం గంగాధర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



రాజంపేట : జిల్లా నుండి రాజంపేట మండలం మీదుగా గుండారం వెళ్లే ప్రజలకు రోడ్ల గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బస్వన్నపల్లి, ఆర్గొండ కొండాపూర్ గ్రామాల మధ్య రోడ్డు ప్రమాదకర గుంతలుగా మారడంతో ప్రమాదాలకు దారితీస్తున్నాయి.

ఎస్సైకి సన్మానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రంజిత్‌ను ఆదివారం మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి, భూంరావు, మోహన్‌రాజ్, జైపాల్ రెడ్డి, వడ్ల రాజమౌళి, సాయిలు, సుదర్శన్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్): మండంలంలోని పెద్ద తక్కడ్‌పల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. గ్రామభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవిపటేల్, విఠల్ రెడ్డి, దేశాయి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పారిశుధ్యలోపం



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని నేతాజీ నగర్ కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో చెత్త ఎత్తే ట్రాక్టర్లు తిరగకపోవడంతో కాలనీ వాసులు చెత్తను కాలనీలోని ఓ మూలన పడేశారు. ఈచెత్తను తరలించకపోవడంతో అదంతా పేరకుపోయి దుర్వాసన వస్తోందన్నారు. దోమల బెడద పెరిగిందని సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

త్వరలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం కమిటీలు



కామారెడ్డి అర్బన్ : జిల్లాలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం మండల కమిటీలను వేయాలని, జిల్లా కేంద్రంలోని శ్రీగోదాదేవి, రంగనాథస్వామి ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం తీర్మానించినట్లు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నల్లవెల్లి అశోక్ తెలిపారు. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశం వివరాలను అశోక్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మల రవి, ప్రధాన కార్యదర్శి నరేందర్, ప్రతినిధులు రాంమోహన్, రమణచారి, అహోబిలం శ్రీనివాస్, రఘు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఫోన్లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దు

భిక్కనూరు : సెల్‌ఫోన్లకు వచ్చే గుర్తింపులేని మెస్సేజ్‌లకు స్పందించవద్దని ఎస్సై సాయికుమార్ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్లకు వచ్చిన ఎస్సెమ్మెస్‌లకు స్పందించవద్దన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసకావద్దని చెప్పారు. సైబర్ నేరాలకు ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

రామారెడ్డి : రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన బందారు నవనీత పురిటి నొప్పులతో 108లో ఆస్పత్రి తరలిస్తుండగా మధ్యలోనే నొప్పులు పెరిగాయి. దీంతో 108లోనే సిబ్బంది ప్రసవం చేశారు. గర్భిని మగబిడ్డకు జన్మనివ్వగా వారిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని ఈఎంటీ ప్రభాకర్, పైలట్ ప్రశాంత్ పేర్కొన్నారు.

గ్రామాల్లో తాగునీటి శాంపిళ్ల సేకరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : జల్ జీవన్ మిషన్‌లో భాగంగా నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్, రాఘవపల్లి గ్రామాల్లో ఆదివారం అధికారులు తాగునీటి శాంపిళ్లను సేకరించారు. తాగునీటి నాణ్యతకు పరీక్షలు నిర్వహించేందుకు సేకరించిన శాంపిళ్లను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ తెలిపారు. ఆయన వెంట జలజీవన్ మిషన్ సిబ్బంది గణేష్, వెంకటేశం తదితరులున్నారు.

నేటి నుంచి తరగతులకు హాజరు కావాలి

బాన్సువాడ రూరల్ : దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో భాగంగా ఎంపికైన విద్యార్థులు సోమవారం తరగతులకు హాజరుకావాలని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ సూచించారు. ఇప్పటికే అటనామస్ తరగతులు ప్రారంభం అయ్యాయన్నారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులందరూ అర్హత ధ్రువీకరణ పత్రాలు కళాశాలలో అందజేయాలన్నారు.

సిబ్బంది కొరత.. రోగుల అవస్థ



పీహెచ్‌సీ ఎదుట వేచి ఉన్న రోగులు



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

- పీహెచ్‌సీలో కరువైన వైద్యం
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న రోగులు
- అందుబాటులో ఉండని అంబులెన్స్
- పట్టించుకోని ఉన్నతాధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత కారణంగా రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన ఉద్యోగులు ఇలావచ్చి అలా వెళ్లిపోతుండడంతో సామాన్యుడికి వైద్యం అందని ద్రాక్షలా మారింది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రావాలంటే రోగులు 25కి.మీ ప్రయాణం చేయాల్సిందే.. రోడ్డు మార్గం సరిగ్గా లేకపోవడంతో రోగుల అవస్థ అంతాఇంతా కాదు. పీహెచ్‌సీలో ఇన్‌చార్జి వైద్యుడు తప్ప పూర్తిస్థాయిలో సిబ్బంది లేక రోగుల అవస్థ అంతాఇంతా కాదు.

రోజూ 100 మంది రోగులు..

పీహెచ్‌సీకి రోజూ సుమారు 100మంది రోగులు వస్తుండగా సిబ్బంది లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. 100మందికి స్టాఫ్ నర్స్ ఒక్కరే ఉదయం నుంచి సాయంత్రం వరకు చికిత్స చేస్తుండడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. సామాన్య ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యానికి సుమారు. రూ. 2వేల వరకు ఖర్చు అవుతోందని ఆవేదన చెందుతున్నారు.

నీళ్లు కూడా కరువే..

పీహెచ్‌సీలో నీటి సౌకర్యం లేక ఉన్న సిబ్బంది.. పీహెచ్‌సీకి వచ్చిన రోగుల మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత తీర్చాలని, నీటి సౌకర్యం కల్పించాలని రోగులు కోరుతున్నారు.

వైద్యులు ఉండట్లేదు..



వైద్యులు ఉండట్లేదు. స్టాఫ్‌నర్స్ ఒక్కరే ఉన్నారు. వైద్యం కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. రూ. 2 వేలు ఖర్చు అవుతోంది. సిబ్బంది కొరతకు పరిష్కారం చూపాలి.

– సైమల్, కాటేపల్లి తండావాసి

సిబ్బంది కొరత తీర్చాలి



పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది కొరత తీర్చాలి. ఉన్న ఒక్క స్టాఫ్ నర్స్‌పై విపరీతమైన భారం పడుతోంది. ప్రమాదంలో గాయమైతే కట్టు కట్టేందుకు అటెండర్ కూడా అందుబాటులో లేరు. టాబ్లెట్ వేసుకుందామంటే మంచినీళ్లు కూడా లేవు.

– అనిప్యాన్, పెద్దకొడప్‌గల్

రక్తదానం ప్రాణదానం

బీబీపేట : రక్తదానం చేయడం ఆపదలో ఉన్నవారి ప్రాణాన్ని కాపాడడమేనని జనగామకు చెందిన వ్యాపారవేత్త ప్రభుత్వం పాఠశాల పునర్నిర్మాణ దాత తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి బ్లడ్ బ్యాంకు సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 50మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. సుభాష్‌రెడ్డి బీబీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సుమారు రూ. 6 కోట్లతో పునర్నిర్మించారు. ఆయన జన్మదిన వేడుకల్లో ప్రముఖ కవి అందెశ్రీ, మిట్టపల్లి సురేందర్, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ ఇంద్రసేనారెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్, వెంకట్‌గౌడ్, సాయికుమార్, స్వామి, రాములు, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బీబీపేట: మండల కేంద్రంలోని 9వ వార్డులో ఉన్నటువంటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, తీగల చుట్టూ తీగలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్న కథనాన్ని 'సాక్షి'లో ప్రచురించగా సంబంధిత అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న వైర్లకు ఉన్న తీగలన్నింటినీ తొలగించారు. మరో విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలను సైతం తొలగించారు.



ట్రాన్స్‌ఫార్మర్‌పై తీగలను తొలగిస్తున్న సిబ్బంది

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాల పండుగ



పిట్లం(జుక్కల్) : మండలంలోని గోద్మేగాం గ్రామంలో గ్రామస్తులు అందరూ కలిసి ఆదివారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని ప్రధానవీధుల గుండా డప్పు, వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ శివారులోని పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చుక్కాపూర్‌లో సుదర్శన హోమం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ గ్రామంలోని ఆలయంలో ఆదివారం లక్ష్మీనృసింహస్వామి సుదర్శన నారసింహ హోమం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్, సిద్దిపేట్ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 21జంటలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ హోమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, మినుకూరి రాంరెడ్డి దంపతులు వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీధర్ రావు, అర్చకులు జూనియర్ అసిస్టెంట్ సురేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహస్వామికి విరాళాలు



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయ నిర్మాణం కోసం ఆదివారం ఆయా గ్రామాలకు చెందిన దాతలు భారీ విరాళాలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మోటూరు అంజనేయులు ఆయన సతీమణి పద్మావతి జ్ఞాపకార్థం రూ.54,216 ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డికి అందజేశారు. అలాగే కామారెడ్డికి చెందిన వెంకట్ రాంరెడ్డి, శోభా దంపతులు రూ.10 వేలు, సంతోష్ రెడ్డి, మమత దంపతులు రూ. 11వేలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఈవో శ్రీధర్ రావు,సిబ్బంది ఉన్నారు.